క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వివిధ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామ్‌నగర్ ఫీడర్ పరిధిలోని రామ్‌నగర్, పాత మిలటరీ కాలనీ, కొండాయపాళెం గేట్ తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

➡ ఎన్టీఆర్ గృహకల్ప ఫీడర్ పరిధిలోని వెంకటేశ్వరపురం టిడ్కో గృహ సముదాయంలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. నవాబుపేట రైతుబజార్, రేబాలవారి సబ్‌స్టేషన్లలోని స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట, ఎఫ్సీఐ కాలనీ, ఏసీనగర్, సరస్వతీనగర్, రాయపుపాళెం, నజీర్‌తోట, సాత్‌రాజుపాళెం ఇండస్ట్రియల్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

➡ నగరంలోని శెట్టిగుంట రోడ్డు సబ్‌స్టేషన్లోని మూడో మైలు, ప్రశాంతినగర్, వెంగళరెడ్డినగర్, రాజీవ్‌గాంధీకాలనీ, కిసాన్‌నగర్, బంగ్లాతోట, యనమలవారిపాళెం, సింహపురికాలనీ, వేణుగోపాల్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

సాధారణ సర్వసభ్య సమావేశం నేడు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నగరంలోని రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించనున్నామని ఎంపీడీఓ శైలేంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించనున్నామని వివరించారు.

సిలిండర్‌పై అదనంగా వసూలు చేస్తే చర్యలు

నెల్లూరు (పొగతోట): గ్యాస్ సిలిండర్‌పై అధికంగా వసూలు చేస్తే సంబంధిత ఏజెన్సీలపై కేసులు నమోదు చేస్తామని జేసీ కార్తీక్ స్పష్టం చేశారు. నగరంలోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో సీఎస్డీటీలు, గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులొస్తున్నాయని, ఇలా వ్యవహరిస్తే సహించేదిలేదని చెప్పారు. డీఎస్ఓ విజయ్‌కుమార్, ఏఎస్ఓలు అంకయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల అందజేత



నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో 50 మంది కేన్సర్ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్ ప్యాకెట్లను ట్రస్ట్ డైరెక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్ శుక్రవారం పంపిణీ చేశారు. పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, సీడబ్ల్యూసీ చైర్మన్ మాధవి, జయప్రకాష్, సిస్టర్లు రమా, జయక్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఏఐఎస్ఎఫ్ నేతల ధర్నా



నెల్లూరు రూరల్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. నగరంలో ర్యాలీని శుక్రవారం నిర్వహించిన అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నాను చేపట్టారు. డీఆర్వో హుస్సేన్ సాహెబ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్ మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన టీడీపీ, ప్రస్తుతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నగర కార్యదర్శి శివమ్ వర్మ, నేతలు అబ్దుల్, జీవన్, సాయి, కోటి, ఆకాష్, ఇమ్రాన్, వైభవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు హెచ్‌ఓడీల డుమ్మా



అర్జీలను స్వీకరిస్తున్న హుస్సేన్ సాహెబ్

నెల్లూరు రూరల్: ఉద్యోగులకు సంబంధించిన ప్రత్యేక గ్రీవెన్స్ డేను కలెక్టరేట్లో శుక్రవారం నిర్వహించారు. హెచ్‌ఓడీలు డుమ్మా కొట్టగా, జేసీ కార్తీక్, డీఆర్వో హుస్సేన్ సాహెబ్ హాజరయ్యారు. మరో సమావేశానికి జేసీ వెళ్లడంతో అర్జీలను డీఆర్వో స్వీకరించారు. రెవెన్యూ, వైద్య, ఆరోగ్య, సచివాలయాలు, ఇరిగేషన్, పంచాయతీరాజ్ తదితర శాఖల ఉద్యోగులు తమ సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. బదిలీలకు సంబంధించిన వినతులు ఎక్కువగా వచ్చాయి. మొత్తం 124 అర్జీలు అందాయి. ఏఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు నిరంతరం వెతలే



పడిగాపులు కాస్తున్న ప్రజలు



విద్యుత్ అంతరాయాలకు గురవుతున్న ట్రాన్స్‌ఫార్మర్

- రాత్రి పది దాటితే బేజారే
- ఫ్యాన్లు తిరగక.. లైట్లు వెలగని దుస్థితి
- 500 కుటుంబాల అగచాట్లు
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పడిగాపులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని ఆ శాఖ ఉన్నతాధికారులు తరచూ ఊదరగొడుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. సరఫరాలో అంతరాయాలు.. లో ఓల్టేజీతో నగరంలోని పలు ప్రాంతాల వినియోగదారులు నిరంతరం అవస్థలు పడుతున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో సింగిల్ ఫేజ్ లైన్ ద్వారానే విద్యుత్‌ను ఇప్పటికీ సరఫరా చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

భయానకం..

నగరంలోని 54వ డివిజన్ జనార్దనరెడ్డికాలనీలోని సబ్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో గల రైలువీధి, ఆటోస్టాండ్, ఒయాసిస్ స్కూల్ తదితర ప్రాంతవాసుల కోసం 315 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అయితే త్రీఫేజ్ లైన్ లేకపోవడంతో సింగిల్ ఫేజ్ ద్వారానే ఇక్కడికి విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. రాత్రి పది నుంచి అర్ధరాత్రి వరకు లోడ్ అధికమై లో ఓల్టేజీ సమస్యతో ఇళ్లలోని ఫ్యాన్లు, లైట్లు అలంకారప్రాయంగా మారుతున్నాయి. మరోవైపు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజులు కాలిపోతుండటంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ పరిణామాల క్రమంలో దాదాపు 500 కుటుంబాలు వారు తీవ్ర అగచాట్లకు గురవుతున్నారు.

ఫిర్యాదు చేసినా ప్రయోజనమేదీ..?

సమస్యపై అధికారులు, సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం కరువవుతోంది. తాత్కాలికంగా మరమ్మతులు చేపడుతున్నా, కొంతకాలానికే పరిస్థితి మళ్లీ మొదటికొస్తోంది. దీంతో సిబ్బంది కోసం ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రజలు పడిగాపులు కాయాల్సిన దుస్థితి తలెత్తుతోంది.

సబ్‌స్టేషన్లోనే నిద్రిస్తాం..!

విసిగివేసారిన స్థానికులు వారం క్రితం చాపలు, దిండ్లు, దుప్పట్లతో సబ్‌స్టేషన్‌కు చేరుకున్నారు. విద్యుత్ లేక రాత్రి వేళ నిద్ర కరువవుతోందని, సబ్‌స్టేషన్లోనే నిద్రిస్తామంటూ తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వచ్చేందుకు బంధువులు భయపడుతున్నారు



రైలువీధి ప్రాంతంలో రాత్రి వేళ విద్యుత్ కొన్నేళ్లుగా పోతూనే ఉంది. దోమల బెడదతో చీకట్లో ఇబ్బందులు పడుతున్నాం. చివరికి మా ఇంటికి బంధువులు రావాలన్నా, హడలిపోతున్నారు. కంటి మీద కునుకు కరువవుతోంది.

– మునెమ్మ

పట్టించుకునేవారేరీ..?



రాత్రి పదైతే కరెంట్ పోతోంది. ఈ విషయమై కరెంటోళ్లకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదు. అప్పుడప్పుడూ రిపేర్ చేసి వెళ్తున్నా, కొద్దిసేపటికే సమస్య మొదటికొస్తోంది. రోజూ ఇదే పరిస్థితి.

– బీబీజాన్

బిల్లుల వసూళ్లపైనే శ్రద్ధ



ఒక నెల బిల్లు కట్టకపోతే వచ్చి కనెక్షన్‌ను కట్ చేస్తున్నారు. రాత్రి వేళ లైట్లు వెలగక.. ఫ్యాన్లు తిరగక నానా వెతలు పడుతుంటే మాత్రం వారికి పట్టడం లేదు. ఫ్యాన్లు తిరగక ఇబ్బందిగా ఉంటోంది.

– చీర్ల శ్రీకాంత్‌యాదవ్

రాత్రయితే హడల్



లో ఓల్టేజీ సమస్యతో రాత్రి వేళ అల్లాడిపోతున్నాం. విద్యుత్ సరఫరా నిలిచిపోతే త్వరగా వచ్చే పరిస్థితే లేదు. సింగిల్ ఫేజ్ లైన్ కారణంగా లో ఓల్టేజీ సమస్య వస్తోంది. కరెంట్ సమస్యను పరిష్కరించేలా చొరవ చూపాలి.

– బత్తల పోలయ్య

ప్రణాళికబద్ధంగా పారిశుధ్య కార్యక్రమాలు



ఇంజినీరింగ్ విభాగాధికారులను అభినందిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుధ్య పనులను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. కేవీఆర్ పెట్రోల్ బంక్ కూడలి సమీపంలోని వీధుల్లో శుక్రవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. రోడ్లను క్రమం తప్పకుండా శుభ్రపర్చాలని సూచించారు. ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి వారి ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా సూచనలు చేయాలని తెలిపారు.

➡ స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో రాష్ట్ర స్థాయిలో నాలుగు.. జాతీయ స్థాయిలో 37వ ర్యాంక్‌ను నెల్లూరు కార్పొరేషన్ సాధించడంలో ఇంజినీరింగ్ విభాగాధికారులు, సిబ్బంది పాత్రను కమిషనర్ నందన్ కొనియాడారు. కమిషనర్‌ను కార్పొరేషన్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ఇంజినీరింగ్ విభాగాధికారులు కలిసి పూల మొక్కలను అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ రహంతుజానీ, డీఈలు ముజాహిదీన్, అనిల్, రఘురామ్, సుదేష్ణ, ప్రసాద్, ఏఈ అర్పిత తదితరులను సత్కరించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, హార్టికల్చర్ ఏడీ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

➡ టౌన్ ప్లానింగ్ విభాగ అనుమతుల్లేకుండా చేపట్టే అనధికార నిర్మాణాలను గుర్తించి, సంబంధిత యజమానులపై చార్జిషీట్లను దాఖలు చేసి నోటీసులను జారీ చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టౌన్ ప్లానింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రంగారావు, ఇన్‌చార్జి సీపీ రఘునాథ్‌రావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు, మురళి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల నిరసన



నెల్లూరు(బారకాసు): మున్సిపల్ కార్మికుల నిరసన ఆరో రోజు శుక్రవారం కొనసాగింది. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలోని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీని చేపట్టారు. అనంతరం ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్, నెల్లూరు అధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య మాట్లాడారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కార్మికులు సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సీఐటీయూ నేతలు సూర్యనారాయణ, సుధాకర్, శివాజీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు మట్టిపాటి శ్రీనివాసులు, రాంబాబు, కిరణ్, లోకేష్, మనోజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

‘డీకేడబ్ల్యూ’లో సాహితీ సదస్సు



నెల్లూరు (టౌన్): తెలుగు సాహిత్యం – ఒక పరిశీలనపై అనే అంశంపై నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో సాహితీ సదస్సును కేంద్ర సాహిత్య అకాడమీ, అభ్యుదయ రచయితల సంఘ నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సాహితీ అంశాలపై పలువురు అవగాహన కల్పించారు. అరసం ఉపాధ్యక్షులు రామకృష్ణ, వెంకటప్పయ్య, పెరుగు రామకృష్ణ, గంగిశెట్టి శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణశ్రీ, తెలుగు, హిందీ ఆచార్యులు సత్యనారాయణ, సురేంద్ర, వైస్ ప్రిన్సిపల్ రమణరావు, రచయితలు, సుబ్రహ్మణ్యం, రాజేంద్రసింగ్, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న రెహమాన్

నెల్లూరు (టౌన్): చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నవాబుపేట ఎస్సై రెహమాన్ పేర్కొన్నారు. సైబర్ నేరాలు, గుడ్.. బ్యాడ్ టచ్ తదితర అంశాలపై నవాబుపేటలోని రవీంద్రభారతి స్కూల్లో శుక్రవారం అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్ వినియోగాన్ని తగ్గించి చక్కగా చదువుకోవాలని కోరారు. స్కూల్ జోనల్ ఇన్‌చార్జి శ్రీహరి, ప్రిన్సిపల్ నిరుపమ, డీన్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➡ భద్రత, రక్షణపై ఫతేఖాన్‌పేటలోని రవీంద్రభారతి స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల రెన్యువల్

నెల్లూరు (టౌన్): గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేసిన కాంట్రాక్ట్ అధ్యాపకులను ఈ విద్యా సంవత్సరానికి రెన్యూవల్ చేశారని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు, సంబంధిత వివరాలు, అర్హత ధ్రువీకరణ పత్రాలను జతచేసి సంబంధిత కళాశాలల ప్రిన్సిపల్స్‌కు సోమవారంలోపు అందజేయాలని కోరారు.

కబడ్డీ పోటీలకు ఎంపికలు రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): యువాంధ్ర కబడ్డీ పోటీలకు సంబంధించిన ఎంపికలను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నామని కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ ఆధార్ కార్డుతో హాజరుకావాలని కోరారు.

యాదే రఫీ మ్యూజికల్ నైట్ రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): యాదే రఫీ మ్యూజికల్ నైట్‌ను నగరంలోని పురమందిరంలో ఆదివారం రాత్రి ఏడు గంటలకు నిర్వహించనున్నామని మహమ్మద్ రఫీ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు జావేద్ అహ్మద్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాయకులు మహబూబ్ బాషా, అమానుల్లాఖాన్, షఫీతో కలిసి పురమందిరంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

ప్రజలను నట్టేట ముంచిన చంద్రబాబు



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బూటకపు హామీలతో ప్రజలను సీఎం చంద్రబాబు నట్టేట ముంచారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ప్రజలకు చంద్రబాబు చేసిన మోసాలపై మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వీడియో సందేశాన్ని పార్టీ కార్యకర్తలు, ప్రజలు వీక్షించారు. అనంతరం రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ నగరాధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, నేతలు పేర్నేటి కోటేశ్వరరెడ్డి, ఖలీల్ అహ్మద్, హంజాహుస్సేనీ, కార్పొరేటర్లు ఉమామహేష్, జయలక్ష్మి, ఊటుకూరు నాగార్జున, యువజన విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కోసూరు రత్నం సేవలు అభినందనీయం



నెల్లూరు(బృందావనం): విశాలాక్షి సాహిత్య మాస పత్రికను నిర్వహిస్తున్న కోసూరు రత్నం సేవలను 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి అభినందించారు. గాంధీబొమ్మ సమీపంలోని అమరావతి చాంబర్స్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. విశాలాక్షి సాహిత్య మాసపత్రిక వార్షికోత్సవ వేడుకలను పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో ఆదివారం నిర్వహించనున్నారని వివరించారు. అనంతరం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కోసూరు రత్నం, సంపాదకుడు ఈతకోట సుబ్బారావు, దోర్నాల హరిబాబు, గోవిందరాజు సుభద్రాదేవి, భాస్కర్, అమీర్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన



నెల్లూరు (టౌన్): డెంగీపై అవగాహన, ర్యాలీని వెంకటేశ్వరపురంలోని ప్రాథమిక పాఠశాలలో జిల్లా వైద్యశాఖ అధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. డెంగీ మాసోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియాధికారి నాగార్జునరావు, సబ్ యూనిట్ అధికారి జయరామ్, నెల్లూరు అర్బన్ సబ్ యూనిట్ అధికారులు జయరామ్, శ్యామ్‌సన్‌బాబు, రామారావు, హెల్త్ అసిస్టెంట్ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు (టౌన్): హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి కల్యాణ మండపంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తోడేటి విక్రమ్, కార్యదర్శిగా వెన్ను నరేంద్ర, ఉపాధ్యక్షులుగా దేవేంద్ర, నానీ, జిల్లా సహాయ కార్యదర్శులుగా వంశీ, లోకేష్, కమిటీ సభ్యులుగా యగ్నేష్, దివేశ్, అమర్, ప్రవీణ్, నాగ్రేంద్ర, విష్ణు ఎన్నికయ్యారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భార్య తీరుతో మనస్తాపానికి గురై..


- భర్త ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): భార్య తీరుతో మనస్తాపానికి గురై భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటలో నివాసం ఉంటున్న నదీమ్ అహ్మద్‌కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు యాసిన్ అహ్మద్ (27) న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. కోవూరుకు చెందిన యువతితో ఏడాది క్రితం ఆయనకు వివాహమైంది. తొలుత కొత్తూరులో.. ఆపై శాంతినగర్‌కు వా రు మారారు. గర్భం దాల్చడంతో ఆమెను నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చూపించారు. ఈ క్రమంలో కోవూరులోని పుట్టింటికి ఆమె వెళ్లారు. అప్పటి నుంచి భర్తతో ఆమె ఎలాంటి సంప్రదింపులు జరపలేదు. భర్త, కుటుంబసభ్యులు కోవూరు వెళ్లగా.. ఆమె అబార్షన్ చేయించుకోవడంతో పాటు స్థానిక పోలీస్‌స్టేషన్లో వారిపై కేసు పెట్టారనే విషయం తెలిసింది. దీంతో నదీమ్ అహ్మద్ తన కోడలు, కుమారుడి కాపురాన్ని రెండు నెలల క్రితం తన ఇంట్లోనే పెట్టించారు. తాజాగా భర్తతో శుక్రవారం గొడవపడి.. మీపై తప్పుడు కేసులు పెడతానని బెదిరించి ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయారు. భార్య కోసం చుట్టుపక్కల వెతికినా జాడ తెలియరాలేదు. భార్య తీరుతో మనస్తాపానికి గురైన ఆయన తన పడక గదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన నదీమ్ అహ్మద్ 108కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని యాసిన్ అహ్మద్‌ను పరిశీలించి, అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఈ మేరకు చిన్నబజార్ పోలీసులకు మృతుడి తండ్రి ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

కార్పొరేషన్లో అంతర్గత బదిలీలు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలోని పలు విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పలువుర్ని అంతర్గతంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులను కమిషనర్ నందన్ శుక్రవారం జారీ చేశారు. ఇన్‌చార్జి శానిటరీ సూపర్‌వైజర్ చినబాబును రెవెన్యూ విభాగంలోని ఏ - 1 క్లర్క్‌గా.. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన కుళాయి పన్నుల డిమాండ్ నోటీసులు, కనెక్షన్లు తదితర అంశాల పర్యవేక్షణకు కృష్ణంరాజును బదిలీ చేశారు. హెల్త్ సెక్షన్‌కు కృపాకర్‌రావు.. పీఆర్వోగా ఉన్న కృష్ణకిశోర్‌ను టౌన్‌ప్లానింగ్ విభాగంలోని జీ - 3కి.. అక్కడ ఉన్న కృష్ణారావును పీఆర్వోగా బదిలీ చేశారు. ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్లోని సీనియర్ అసిస్టెంట్ మృదుల, జూనియర్ అసిస్టెంట్ ఆనంద్‌బాబును వీఆర్ హైస్కూల్‌తో పాటు ఇతర మున్సిపల్ స్కూళ్లకు సంబంధించిన రికార్డుల నిర్వహణకు కేటాయించారు. సీనియర్ అసిస్టెంట్ సుహాసినిని మెప్మా సెక్షన్‌కు.. అక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న బాలసుబ్రహ్మణ్యాన్ని హౌసింగ్ సెక్షన్లోని హెచ్‌ఎఫ్‌ఏకు బదిలీ చేశారు.

కనులపండువగా..



నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శాకంబరిగా శుక్రవారం దర్శనమిచ్చారు. దేవస్థాన ప్రాంగణాన్ని కూరగాయలతో చెన్నై నుంచి వచ్చిన ప్రత్యేక కళాకారులు అలంకరించారు. పది రకాల ప్రసాదాలను అందజేశారు. దేవస్థాన పాలకమండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, ప్రధాన కార్యదర్శి నిచ్చెనమెట్ల చిరంజీవి, కోశాధికారి ఉమ్మెన జనార్దన్, ఉపాధ్యక్షుడు వేముల ప్రసాద్, సహాయ కార్యదర్శి మునగా వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యుడు హేమంత్, గౌరవ సలహాదారు ఆంజనేయులు తదితరులు పర్యవేక్షించారు.

శాకంబరిగా భ్రమరాంబ



నెల్లూరు(బృందావనం): ఆషాఢ మాస ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకొని నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. అభిషేకం, అర్చనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈఓ మల్లికార్జునరెడ్డి, గౌతమ్‌రెడ్డి, రాజేష్, నాగరాజు, ముకేష్, ఉమాదేవి పర్యవేక్షించారు.

రాజరాజేశ్వరి ఆలయంలో పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో రాహుకాల ఉద్యాపన పూజలను శుక్రవారం నిర్వహించారు. 72 మంది పాల్గొని అమ్మవారికి చీర, జాకెట్టు, 108 నిమ్మకాయల మాలలను సమర్పించారు. వేదపారాయణం, సంధ్యామేళం, కుంభహారతులు, పల్లకిసేవను నిర్వహించారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.